

ఈ రేస్‌పై చర్చకు పట్టుబడుతూ శాసనసభలో స్పీకర్ పోడియం ఎదుట ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులను తప్పుబడుతూ శాసనమండలి ఎదుట నిరసన వ్యక్తంచేస్తున్న ఎమ్మెల్సీలు

కేటీఆర్‌పై కేసు అక్రమం

ఫార్ములా ఈ-కార్ రేస్‌పై చర్చకు పట్టుబట్టిన బీఆర్ఎస్ • దద్దరిల్లిన ఉభయసభలు.. పోడియం ఎదుట ఆందోళన

చర్చకు అనుమతించని స్పీకర్, మండలి చైర్మన్ • అసెంబ్లీ, మండలిలో పట్టువీడని బీఆర్ఎస్ సభ్యులు

హోరెత్తిన నినాదాలు.. ఒకటికి రెండుసార్లు వాయిదా • అసెంబ్లీలో నిరసనల మధ్యనే పొంగులేటి ప్రసంగం

అసెంబ్లీలో పోటాపోటీగా అధికార, ప్రతిపక్షాల నినాదాలు • శాసన మండలిలో చేతులెత్తేసిన సర్కార్.. సభ నేటికి వాయిదా

- **మేం తప్ప చేయలేదు.. రాష్ట్రం కోసమే పనిచేశాం**
- **తప్ప అంటున్నవారు చర్చ పెట్టి అదేమిటో చెప్పండి**
- **ఎమ్మెల్యే కేటీఆర్‌పై అక్రమ కేసు పెట్టారు**
- **ఆయనకు చెప్పకొనే అవకాశం ఇవ్వాలి**
- **అసెంబ్లీలో హరీశ్‌రావు డిమాండ్**

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్‌పై పెట్టిన ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసు శుక్రవారం ఉభయసభల్లో ప్రకంపనలు సృష్టించింది. కేసుపై చర్చించాలని పట్టుబడుతూ బీఆర్ఎస్ సభ్యులు చేపట్టిన ఆందోళనలతో శాసనసభ, శాసనమండలి దద్దరిల్లాయి. అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఆందోళనల మధ్యనే భూ భారతి బిల్లుపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ప్రసంగించగా, మండలిలో బీఆర్ఎస్‌ను ఎదుర్కోవడంలో అధికారపార్టీ పూర్తిగా విఫలమైంది. మండలిలో శుక్రవారం మూడు బిల్లులను ప్రవేశపెట్టాల్సి ఉండగా, ప్రభుత్వం ఆ పని చేయలేకపోయింది. కేటీఆర్‌పై కేసును నిరసిస్తూ బీఆర్ఎస్ సభ్యులు శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి ఉభయసభలకు హాజరయ్యారు. ఈ-కార్ రేసింగ్‌పై చర్చించాలని ఉభయసభల్లోనూ పట్టుబట్టి, సభను అడ్డుకున్నారు. దీంతో ఒకటికి రెండుసార్లు ఉభయసభలు వాయిదాపడ్డాయి. శాసనమండలిలో మూడోసారి సమావేశమైన తరువాత కూడా సభ అదుపులోకి రాకపోవడంతో చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సభను శనివారానికి వాయిదా వేశారు.

దమ్ముంటే ఉంటే చర్చపెట్టండి

శుక్రవారం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభంకాగానే భూభారతిపై చర్చను చేపట్టనున్నట్టు స్పీకర్ ప్రకటించారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి మాట్లాడే అవకాశమిచ్చారు. ఈ-కార్ రేసింగ్‌పై చర్చను అనుమతించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కోరారు. రెండు చేతులెత్తి దండం పెడుతూ.. 'స్పీకర్ సార్ చర్చకు అనుమతించండి' అని విజ్ఞప్తి చేశారు. 'ప్రశ్నోత్తరాలు ఎలాగూ లేవు. రాత్రి 12 గంటల వరకు చర్చిద్దాం.. ఈ-కార్ రేసింగ్‌పై చర్చకు అనుమతించాలి' అని కోరారు. ప్రభుత్వానికి దమ్ము, చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీలో చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. అయినా స్పీకర్ అనుమతించలేదు.

కేటీఆర్‌ను అప్రతిష్ఠపాలు చేసేందుకే

కేటీఆర్‌ను అప్రతిష్ఠపాలు చేసి బీఆర్ఎస్‌ను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. అసెంబ్లీ నడిచే సమయంలో ఒక ఎమ్మెల్యేపై అక్రమ కేసు పెట్టారని, ఫార్ములా-ఈ కార్ రేస్‌పై చర్చకు స్పీకర్ చాంబర్‌లో కలిసి విజ్ఞప్తి చేశామని తెలిపారు. ఫార్ములా-ఈ కార్ రేస్ అంశంలో రకరకాల లీకులు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాము తప్పు చేశామంటున్నారని, సభలో చర్చించి అదేదో చెప్పాలని డిమాండ్ చేశారు. తాము చేసింది ఎందుకు తప్పుకాదో ఈ సభ ద్వారా తాము కూడా ప్రజలకు చెప్తామని స్పష్టంచేశారు. ప్రభుత్వం పెట్టింది అక్రమ కేసు కాకుంటే సభలో చర్చించాలని సవాల్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్ పోడియం ముందు ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో సభను స్పీకర్ వాయిదా వేశారు.

కొనసాగిన ఆందోళన..

మళ్లీ సభ ప్రారంభంకాగానే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బీఆర్ఎస్ సభ్యులను సముదాయించే ప్రయత్నం చేశారు. భూ భారతిపై చర్చ అనంతరం తన చాంబర్‌కు పిలిపించి మాట్లాడతానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ సభ్యులు శాంతించలేదు. ఇదే సమయంలో మంత్రి పొంగులేటికి స్పీకర్ మాట్లాడే అవకాశమిచ్చారు. భూ భారతిపై మంత్రి పొంగులేటి మాట్లాడారు. ఆ తర్వాత బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రసంగించారు. మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతున్నప్పుడు 'బడే భాయ్.. ఛోటే భాయ్' అంటూ బీఆర్ఎస్ సభ్యులు నినాదాలు చేశారు. దీంతో స్పీకర్ సభను వాయిదావేశారు. విరామం తర్వాత అసెంబ్లీ ప్రారంభం కాగానే బీఆర్ఎస్ సభ్యులు నిరసన కొనసాగించారు. నిరసనగా బయటకు వెళ్లిపోయారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఆందోళన

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఆందోళనకు పోటీగా అసెంబ్లీలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆందోళనకు దిగారు. కొందరు సభ్యులు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సీట్ల వైపు దూసుకొచ్చారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అత్యంత వేగంగా హరీశ్‌రావును సమీపించారు. 55 మంది మార్షల్స్ సభలో మోహరించారు.

మండలిలో చేతులెత్తేసిన సర్కార్

- **పది నిమిషాలైనా సాగకుండానే సభ వాయిదా**
- **మూడు బిల్లులు ప్రవేశపెట్టలేకపోయిన ప్రభుత్వం**

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): మాజీ మంత్రి కేటీఆర్‌పై పెట్టిన ఫార్ములా-ఈ రేస్ కేసును ఎత్తివేయాలంటూ బీఆర్ఎస్ సభ్యులు చేసిన ఆందోళనలతో శాసనమండలి దద్దరిల్లింది. ఒకటికి రెండుసార్లు సభను వాయిదా వేసినా పరిస్థితి అదుపులోకి రావడంతో చివరకు ఏ చర్చా జరగకుండానే మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సభను శనివారానికి వాయిదా వేశారు. మండలిలో ప్రతిపక్ష నేత మధుసూధనాచారి ఆధ్వర్యంలో శుక్రవారం నల్లబ్యాడ్జీలతో హాజరైన బీఆర్ఎస్ సభ్యులు సమావేశాన్ని స్థంభింపచేశారు. కేటీఆర్‌పై పెట్టిన ఫార్ములా-ఈ రేస్ కేసును ఎత్తివేయాలని ఆందోళనకు దిగారు. సభ సాగకపోవడంతో చైర్మన్ తొలుత 15 నిమిషాలపాటు వాయిదా వేశారు. ఉదయం 11:20 గంటలకు మండలి సమావేశం తిరిగి ప్రారంభమైనప్పటికీ, బీఆర్ఎస్ ఆందోళనలకు దిగింది. చర్చ లేకుండానే చైర్మన్ సభను శనివారానికి వాయిదా వేశారు. బీఆర్ఎస్ సభ్యులు మీడియా పాయింట్ వద్ద నిరసన తెలిపారు.

చైర్మన్ వారించినా

కేటీఆర్‌పై పెట్టిన కేసు ఎత్తివేయాలని సభలో చర్చ పెట్టాలన్న డిమాండ్లతో ఆందోళనకు దిగిన బీఆర్ఎస్ సభ్యులను మండలి చైర్మన్ వారించే ప్రయత్నం చేశారు. బీఆర్ఎస్ సభ్యులు వెనక్కి తగ్గలేదు. కేసుపై చర్చ జరగాలని పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో చైర్మన్, మంత్రులు నిశ్చేష్టులయ్యారు.

ఆ ఎమ్మెల్యే వైఖరి వివాదాస్పదం

సభలో షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకరయ్య వైఖరి వివాదాస్పదమైంది. ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై ఆయన పేపర్ విసిరే ప్రయత్నం చేస్తున్న వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయ్యింది. ఆ తర్వాత ఆయన చెప్పు తీసి విసరబోయారని, వాటర్ బాటిల్ విసిరేయబోయారంటూ సోషల్ మీడియాలో వార్తలొచ్చాయి. ఇటీవలే వీర్లపల్లి శంకరయ్య వెలమ కులంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భౌతిక దాడులకు దిగుతామని బెదిరించారు. 'వెలమల్లారా ఖబర్దార్.. కుట్రలు చేసే వెలమల వీపులు విమానాలు మోగుతాయ'ంటూ అసభ్య పదజాలంతో దూషించారు. ఈ నేపథ్యంలో తాజా వివాదం మొదలైంది.

లోకం పోకడ



ఐదేళ్లలో ఆరు గ్యారంటీలు అమలు చేయడం ఎలా? పుస్తకం వుందా?

విపక్షాలకు మైక్ కట్

- **మీడియా పాయింట్‌లోనూ వాళ్లే మాట్లాడ్తరు**
- **కొత్త రూల్.. అంటూ పోలీసుల దబాయింపు**
- **అధికారపక్షానికి మాత్రం అన్ని అనుమతులు**
- **బీఆర్ఎస్ సభ్యులకు అడుగడుగునా ఆంక్షలే..**

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): అధికారపక్షం ఏది చేసినా ఒప్పే.. ప్రతిపక్షం ఏది చేసినా తప్పే.. అన్నట్టుగా వ్యవహరిస్తున్నది కాంగ్రెస్ సర్కారు. శాసనసభలో జరుగుతున్న పరిణామాలే ఇందుకు నిదర్శనం. సభలో, మీడియా పాయింట్ వద్ద మాట్లాడే విషయంలో, నిరసన తెలిపే అంశంలో ఈ వ్యత్యాసాలు స్పష్టంగా కనిపించాయి. శాసనసభలో తమ అభిప్రాయం చెప్పేందుకు విపక్షాలకు మైక్ ఇవ్వకుండా గొంతు నొక్కేస్తున్నారు. ఇదే విషయాన్ని పలుమార్లు బీఆర్ఎస్ సభ్యులు మీడియా ఎదుట వాపోయారు. సభను వాకౌట్‌చేసి మీడియా పాయింట్ వద్ద మాట్లాడేందుకూ విపక్షానికి అవకాశం ఇవ్వడం లేదు. కొత్త రూల్ అంటూ పోలీసులు అడ్డుకుంటున్నారు. శుక్రవారం సభను వాకౌట్ చేసిన అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కేపీ వివేకానంద, డాక్టర్ సంజయ్, విజయుడు, పాడి కౌశిక్‌రెడ్డి అసెంబ్లీ మీడియా పాయింట్ వద్దకు వస్తుండగా.. పది మంది మార్షల్స్ అడ్డుకున్నారు. వాకౌట్‌కు కారణాలు, సభలో పరిస్థితులపై మీడియా ద్వారా ప్రజలకు వివరించే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. అటు సభలో, ఇటు మీడియా పాయింట్‌లో ప్రధాన ప్రతిపక్షం గొంతు వినిపించకుండా ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అంటున్నారు. అధికారంలో ఉండి కూడా అటు సభలో, ఇటు మీడియా పాయింట్‌లోనూ వాళ్లే మాట్లాడుతున్నారని, ఇది ఎంతవరకు సమంజసమో అధికారపక్ష ఎమ్మెల్యేలు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచిస్తున్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ సభ్యులు నిరసన తెలుపడంపైనా సర్కారు ఆంక్షలు విధిస్తున్నది.

బీర్‌పూర్ దోపిడీ ముఠా అరెస్ట్

- గుప్త నిధుల ప్రయత్నం విఫలమై.. రూటు మార్చి..
- వృద్ధ దంపతులను కట్టేసి కొట్టి దోపిడీ • 10 తులాల బంగారు నగలు, నగదు రికవరీ • రెండు బొమ్మ తుపాకులు స్వాధీనం
- ముఠాలో సర్కారు ఉద్యోగి • వివరాలు వెల్లడించిన ఎస్పీ అశోక్‌కుమార్

దోపిడీ ముఠా నుండి రికవరీ చేసిన నగలు, నగదు, బొమ్మ పిస్టల్‌ను చూపుతున్న ఎస్పీ

జగిత్యాల కలెక్టరేట్, డిసెంబర్ 20 : సంచలనం సృష్టించిన బీర్‌పూర్ దోపిడీ ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎస్పీ అశోక్ కుమార్ జగిత్యాల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. నిర్మల్ జిల్లా దస్తూరాబాద్ మండలం మున్యాల గ్రామానికి చెందిన ముస్సీసుల శ్రీనివాస్, జైపూర్ మండలం పౌనూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో రికార్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న లక్షెట్టిపేటకు చెందిన చిప్పబత్తుల తులసయ్య, జగిత్యాల రూరల్ మండలం గుట్రాజ్‌పల్లెకు చెందిన బక్కెనపెల్లి అరుణ్, బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన యశోద శ్రీనివాస్, ధర్మపురి మండలం తుమ్మెనాలలో కాలభైరవ పేరుతో హోటల్ నిర్వహిస్తున్న జగిత్యాల రూరల్ మండలం అనంతారం గ్రామానికి చెందిన సైదు సహదేవ్, జన్నారం మండలం మురిమడుగుకు చెందిన రత్నం మాణిక్యం, మంచిర్యాల పట్టణానికి చెందిన ముకునూర్ కిరణ్‌కుమార్ గుప్త నిధుల కోసం ఓ ముఠాగా ఏర్పడ్డారు. వీరి వద్ద ఉన్న ఓ చిన్న యంత్రం సహాయంతో పలు ప్రాంతాల్లో గుప్త నిధుల కోసం వెతుకగా, ఎక్కడా దొరకలేదు. దీంతో రూటు మార్చుకున్న వీరు డబ్బులు సులభంగా సంపాదించాలని నిర్ణయించుకున్నారు. దీని కోసం దోపిడీ, దొంగతనాలు ఎంచుకున్నారు. బాగా డబ్బులున్న వారి ఇంట్లో చొరబడి నగలు, నగదు ఎత్తుకెళ్లాలని నిర్ణయించుకున్నారు. బీర్‌పూర్‌కు చెందిన కాసం ఈశ్వరయ్య, అతడి భార్య ఇద్దరే ఇంట్లో ఉంటారని, వీరి ఇంటిని దోచుకోవడం ఎంతో సులభమని అదే గ్రామానికి చెందిన యశోద శ్రీనివాస్ ముఠా సభ్యులకు తెలిపాడు. సైదు సహదేవ్ నిర్వహిస్తున్న కాలభైరవ దాబా వద్ద ఏడుగురు ముఠా సభ్యులు ఈ నెల 13న రాత్రి సమావేశమై ఈశ్వరయ్య ఇంట్లో దోపిడీ గురించి ప్లాన్ వేసుకున్నారు. దీని ప్రకారం అదే రోజు రాత్రి 2.30 గంటలకు మంకీ క్యాపులు ధరించి నంబర్‌లేని ద్విచక్రవాహనాలపై బీర్‌పూర్‌కు చేరుకుని ఈశ్వరయ్య ఇంటి వెనకాల గోడ దూకి బాత్‌రూం వద్ద నక్కిఉన్నారు. ఈశ్వరయ్య కాలకృత్యాల కోసం ఇంటి తలుపు తీసి బయటి బాత్‌రూం వద్దకు వెళ్లగా, అక్కడే మాటు వేసి ఉన్న ముఠా సభ్యులు ఈశ్వరయ్యను గట్టిగా పట్టుకుని బొమ్మ తుపాకీలతో బెదిరించారు. దాడి చేసి ఇంట్లోకి లాక్కెళ్లి అతడిని, ఆయన భార్యను తాళ్లతో కట్టేసి నోట్లో గుడ్డలు కుక్కి వారి ఒంటిపై, ఇంటి బీరువాలో ఉన్న బంగారు నగలు, నగదు దోచుకుని అటవీ మార్గం నుంచి పారిపోయారు. ముఠా దాడిలో ఈశ్వరయ్యకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ సేకరించి బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. కేసును సవాల్‌గా తీసుకున్న ఎస్పీ జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విచారణ చేపట్టారు. ఘటనా స్థలంలో దొరికిన క్లూస్, సాంకేతిక పరిజ్ఞానంతో ముఠాను గుర్తించిన పోలీసులు తుమ్మెనాల క్రాస్ రోడ్డు వద్ద గల కాలభైరవ దాబా వద్ద ఉన్నట్టు పక్కా సమాచారంతో తెలుసుకుని వెళ్లి ముఠా సభ్యుల్లోని ముస్సీసుల శ్రీనివాస్, తులసయ్య, అరున్‌కుమార్, యశోద శ్రీనివాస్, సైదు సహదేవ్, రత్నం మాణిక్యంను అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రూ.5 లక్షల విలువైన 10 తులాల బంగారు నగలు, రూ.10 వేల నగదు, రెండు బొమ్మ తుపాకీలు, ఆరు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ముఠాలో ఏడో వ్యక్తి కిరణ్‌కుమార్‌ను త్వరలోనే పట్టుకుంటామని ఎస్పీ తెలిపారు.

ముఠాలో జడ్పీ హైస్కూల్ రికార్డ్ అసిస్టెంట్

దోపిడీ చేసిన ముఠాలో ఓ జడ్పీ హైస్కూల్‌లో రికార్డ్ అసిస్టెంట్‌అయిన చిప్పబత్తుల తులసయ్య ఉన్నాడు. ప్రభుత్వ ఉద్యోగి అయిఉండి, పదవీ విరమణకు దగ్గర ఉన్న వ్యక్తి ముఠాలో చేరి గుప్త నిధులు, జల్సాల కోసం దోపిడీకి దిగడం అందరినీ విస్మయానికి గురిచేసింది.

కస్తూర్బా లో చదువులకు ఆటంకం!

- నిరవధిక దీక్షలో టీచర్లు
- బోధనకు ఇబ్బందులు
- ఆందోళనలో తల్లిదండ్రులు

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న సమగ్ర శిక్ష పరిధిలోని టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పది రోజులుగా దీక్ష చేస్తుండడంతో విద్యార్థుల చదువులకు ఆటకం ఏర్పడుతున్నది. తరగతులు జరగక, క్లాసుల నిర్వహణ లేక కొందరు విద్యార్థులు ఇంటి దారి పడుతుండగా, మరికొందరు మాత్రం చదువులు పక్కన బెట్టి తరగతి గదుల్లోనే ఆట పాటలతో గడపాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో వారి తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది.

గురువారం పెద్దపల్లిలో నిరవధిక దీక్షలో కేజీబీవీ ఎస్‌వోలు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది

పెద్దపల్లి, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ)/ పెద్దపల్లి కమాన్ : అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని ఎన్నికల సమయంలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదు. ప్రభుత్వం కొలువుదీరి ఏడాది దాటినా.. అమలు కాలేదు. దీంతో సమగ్ర శిక్ష పరిధిలోని ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మెబాట పట్టారు. ఈ నెల 10 నుంచి జిల్లా కేంద్రాల్లో నిరవధిక దీక్షలు చేస్తున్నారు. అయితే ఈ దీక్షల్లో ప్రతి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది కూడా పాల్గొంటున్నారు. దీంతో కేజీబీవీల్లో ఇద్దరు ముగ్గురు మాత్రమే బోధిస్తున్నారు. పెద్దపల్లి జిల్లాలో చూస్తే.. పది కేజీబీవీల్లో పది మంది స్పెషల్ ఆఫీసర్లు, 125 మంది టీచర్లు, 95 మంది నాన్ టీచింగ్ సిబ్బంది పని చేస్తుండగా, అందులో ప్రతి కేజీబీవీ నుంచి పది మంది వరకు భోదన, ఇద్దరు భోధనేతర సిబ్బంది దీక్షలో కూర్చుంటున్నారు. దీంతో సుమారు 3వేల మంది విద్యార్థుల చదువులకు ఆటంకం ఏర్పడుతున్నది. ప్రతి కేజీబీవీలో ఇద్దరు లేదా ముగ్గురు టీచర్లు మాత్రమే బోధిస్తుండగా.. క్లాసులు సరిగ్గా జరగక పిల్లలు ఇంటి బాట పట్టేందుకు రెడీ అవుతున్నారు. మరికొందరు అక్కడే ఆటాపాటలతో గడుపుతున్నారు. దాదాపు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇలాంటి పరిస్థితే ఉన్నది. అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ (యూఆర్ఎస్) సిబ్బంది కూడా దీక్షల్లో పాల్గొంటుడడంతో అనాథలు, బాల కార్మికులు, వీధి బాలలకు కూడా విద్య అందకుండాపోయే ప్రమాదం ఏర్పడింది. కాంగ్రెస్ నిర్లక్ష్యం మూలంగా ఈ పరిస్థితి వచ్చిందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఏడాది పాలనలోనే కేజీబీవీలు, గురుకులాలు అధ్వానంగా మారాయని విమర్శిస్తున్నారు.

ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలి

సమగ్ర శిక్ష ఉద్యోగులందరూ దాదాపు 18 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్నారు. గతేడాది వరంగల్ ఏకశిలా పార్క్ వద్ద ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేస్తున్న నిరవధిక దీక్షకు రేవంత్‌రెడ్డి మద్దతు తెలిపి మాట ఇచ్చినట్టు ఇచ్చిన మమ్మల్ని రెగ్యులర్ చేయాలి. ప్రజాప్రభుత్వం ఏర్పడ్డాక టీ తాగినంత సమయంలో మా సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చి, ఏడాది గడిచినా పట్టించుకోవడం లేదు. మేం చేస్తున్న ధర్నాతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజూ నిరసనల్లో జిల్లాలోని 90 శాతం మంది ఉద్యోగులు పాల్గొంటున్నారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి, పే స్కేల్ ప్రకారం జీతాలు ఇవ్వాలి. సమస్యలు పరిష్కరించే దాకా ఉద్యమాన్ని కొనసాగిస్తాం.

- ఎం స్వప్న, స్పెషల్ ఆఫీసర్, భూపతిపూర్ (సుల్తానాబాద్)

ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి

రేంవత్‌రెడ్డి తమకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. వంద రోజుల్లో తమను రెగ్యులరైజ్ చేస్తామని హన్మకొండలో సమగ్రశిక్షా ఉద్యోగుల దీక్షా శిబిరం వేదికగా హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన ఏడాది గడుస్తున్నా.. మా సమస్యలను పట్టించుకోవడంలేదు. తొమ్మిది రోజులుగా సమస్యల పరిష్కారం కోసం ధర్నాకు దిగినా ఎవరూ స్పందిచడం లేదు. ఇది చాలా బాధాకరం

- తాళ్లపల్లి మల్లయ్య, జేఏసీ నేత (మంథని)

విద్యాశాఖలో విలీనం చేయాలి

సమగ్రశిక్షా ఉద్యోగులను ప్రభుత్వం విద్యాశాఖలో విలీనం చేయాలి. మమ్మల్ని రెగ్యులర్ చేయడంతోపాటు పే స్కేల్ అమలు చేయాలి. సమస్యల పరిష్కారం కోసం తొమ్మిది రోజులుగా నిరసనలు చేస్తున్నాం. రాష్ట్ర కమిటీ నాయకులతో ప్రభుత్వం సంప్రదింపులు జరిపినా ఇప్పటికీ ఎలాంటి ప్రకటనలు చేయలేదు. వెంటనే ప్రభుత్వం మా సమస్యలను పరిష్కరించాలి.

- స్వప్న, కేజీబీవీ ఎస్‌వో (ముత్తారం)

శునకానికి బారసాల

శునకం పిల్లలకు బారసాల చేస్తున్న మహిళలు

జగిత్యాల, డిసెంబర్ 20: జగిత్యాల జిల్లా కేంద్రంలోని హనుమాన్‌వాడకు చెందిన అయ్యోరి సుధాకర్-రేవతి దంపతులకు శునకాలంటే ఇష్టం. వారు పెంచుకున్న శునకం ఐదు పిల్లలకు జన్మనించింది. ఈ సందర్భంగా సదరు దంపతులు శుక్రవారం శునకాలకు బారసాల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారికి భోజనాలు పెట్టారు. కార్యక్రమంలో అయ్యోరి రాజ్‌భగత్, రేవతి, హరిప్రియ, అనూష, గుండేటి బేబీరాణి, తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్లలో మరో నేత కార్మికుడి ఆత్మహత్య

గణేశ్ (ఫైల్)

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్20 (నమస్తే తెలంగాణ): సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మరో నేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన దూస గణేశ్(50) మరమగ్గాల పని చేసేవాడు. గణేశ్‌కు భార్య సువర్ణ, కూతుళ్లు సుమశ్రీ, పూజిత ఉన్నారు. అయితే అవసరాల కోసం బజాజ్ ఫైనాన్స్‌లో పర్సనల్‌గా రూ.5లక్షల అప్పు తీసుకున్నాడు. కొంతకాలంగా సరైన ఉపాధి లేకపోవడంతో ఖాళీగా ఉంటున్నాడు. దీంతో కిస్తీలు కట్టడం లేదు. దీంతో మనస్తాపం చెంది గురువారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, బజాజ్ ఫైనాన్స్ వాళ్లు ఇబ్బంది పెట్టడం వల్లే తాను చనిపోతున్నట్లు సూసైడ్ లేఖ రాశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. గణేశ్ నేతన్న బీమాలో చేరినట్లు చేనేత జౌళీశాఖ ఏడీ సాగర్ తెలిపారు.

అమిత్‌షాపై ఆగ్రహజ్వాల

కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం నాయకులు

కరీంనగర్ తెలంగాణచౌక్, డిసెంబర్20: డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై పలు దళిత, ప్రజా, వామాపక్షాల సంఘాల నాయకులు శుక్రవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా నిరసన తెలిపారు. కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు సముద్రాల అజయ్ ఆధ్వర్యంలో నాయకులు నిరనస తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించేలా మాట్లాడినా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ నుంచి రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. అమిత్‌షా పార్లమెంట్ సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ, రైతు సంఘం, డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాణలు చెప్పాలన్నారు.